

## టాలెంట్ వర్కవుట్ కాలేదు

సినీ ఇండస్ట్రీలో హిట్ హీరోయిన్‌గా పేరు తెచ్చుకోవడం కష్టం. వచ్చిన పేరును నిలబెట్టుకోవడం మరింత కష్టం. బాలీవుడ్‌తోపాటు టాలీవుడ్‌లోనూ సూపర్ హిట్ సినిమాల్లో నటించి మంచి హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న భామ రిమీ సేన్. 'ధూమ్' సినిమాలో అభిషేక్ బచ్చన్ సరసన నటించి హిట్ కొట్టిన ఈ భామ తెలుగులో మెగాస్టార్ చిరంజీవి 'అందరివాడు'లోనూ మెరిసింది. 2003లో 'హంగామా' సినిమాతో బాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చిన రిమీ సేన్ గరం మసాలా, ఫిర్ హేరా ఫేరీ, గోల్‌మాల్, బాగ్‌బాన్ సినిమాలతో స్టార్ హీరోయిన్ స్థాయికి ఎదిగింది. అయితే, ప్రాధాన్యం లేని పాత్రలు రావడం వల్లే అప్పట్లో కొన్ని సినిమాలు చేయలేదని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది రిమీ. 'కొన్ని కథల్లో నా పాత్రకు పెద్దగా ప్రాధాన్యం ఉండేది కాదు. హంగామా, జానీ గద్దర్ లాంటి చిత్రాల్లో మంచి పాత్రలు చేశా. ఆ తర్వాత అలాంటి పాత్రలే వస్తే బాగుంటుందని కోరుకున్నా. కానీ వర్కవుట్ కాలేదు. అందుకే నా కెరీర్ అనుకున్నంత సక్సెస్ కాలేద'ని రిమీ వ్యాఖ్యానించింది. 'ఈ ఇండస్ట్రీలో టాలెంట్‌కు అంతగా ప్రాధాన్యం లేదు. ముందుగా వ్యక్తులను ఎలా మేనేజ్ చేయాలో తెలియాలి. లేకపోతే ఏ పనీ జరగదు. చాన్సులు అడుక్కోవడం, పీఆర్ చేయడం నాకు రాదు. స్నేహితులే నన్ను మోసం చేశారు' అని వాపోయింది రిమీ సేన్.


నమస్తే తెలంగాణ

# జిందగీ

11

హైదరాబాద్ | ఆదివారం 30 జూన్ 2024 www.ntnews.com






# కల్కితో లక్ష్యాన్ని చేరుకున్నాం

**అగ్ర నిర్మాత సి.అశ్వనీదత్ నెలకొల్పిన వైజయంతీ మూవీస్ ఈ ఏడాదితో యాభై వసంతాలను పూర్తి చేసుకుంది. ఈ ప్రయాణంలో ఎన్నో కమర్షియల్ బ్లాక్‌బస్టర్స్‌ను అందించింది. వైజయంతీ మూవీస్ గోల్డెన్‌జూబ్లీ ఇయర్‌లోకి అడుగుపెట్టిన తరుణంలో 'కల్కి 2898' రూపంలో అపూర్వ విజయాన్ని దక్కించుకొని చరిత్ర సృష్టిస్తున్నది. ప్రభాస్ కథానాయకుడిగా నాగ్‌అశ్విన్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం గురువారం ప్రేక్షకుల ముందుకొచ్చింది. ప్రపంచవ్యాప్తంగా రికార్డుస్థాయి వసూళ్లతో దూసుకుపోతున్నది. ఈ నేపథ్యంలో నిర్మాత సి.అశ్వనీదత్ పంచుకున్న విశేషాలు..**


మా చిత్రానికి తెలుగు రాష్ట్రాలతోపాటు దేశవ్యాప్తంగా అపూర్వ స్పందన లభిస్తున్నది. విదేశాల నుంచి కూడా పాజిటివ్ రిపోర్ట్స్ వస్తున్నాయి. మేము ఊహించినట్లుగానే సినిమా అఖండ విజయాన్ని సాధిస్తున్నది. ఈ సందర్భంగా 'కల్కి 2898' చిత్రం ద్వారా ఓ కొత్త ప్రపంచాన్ని సృష్టించి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తున్న దర్శకుడు నాగ్‌అశ్విన్ క్రియేటివ్ విజన్‌కు హ్యాట్సాఫ్ చెబుతున్నా. మాకు వచ్చిన రిపోర్ట్స్ ప్రకారం తొలి రెండు రోజుల్లో 298కోట్లకు పైగా వసూళ్లను సాధించింది. ఈ సినిమా మేము అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడం ఆనందంగా ఉంది.

### కోరినవన్నీ సమకూర్చాను

దర్శకుడిగా నాగ్‌అశ్విన్ ఎంతటి ప్రతిభావంతుడో నాకు తెలుసు. 'మహానటి' తర్వాత ఎలాంటి భారీ ప్రాజెక్ట్‌నైనా తెరకెక్కించగలడనే నమ్మకం ఏర్పడింది. అతను ఏ కథ చెప్పినా నో చెప్పకుండా ముందుకువెళ్లమని మా అమ్మాయిలకు చెప్పాను. నేను ఇండస్ట్రీలోకి వచ్చి యాభై ఏళ్లయింది. నిర్మాతగా నా తొలి చిత్రం 'ఎదురులేని మనిషి' నుంచి 'కల్కి' వరకు దర్శకుడు చెప్పింది వినడం, తనకు కావాల్సింది సమకూర్చడం తప్ప డిస్కషన్స్ చేయను. 'కల్కి' విషయంలోనూ నాగ్‌అశ్విన్ కోరినవన్నీ సమకూర్చాను.

### విజయంపై కాన్ఫిడెంట్‌గా ఉన్నాం

ఈ సినిమా విషయంలో మొదటినుంచీ చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నాం. తొలుత మిడ్ సమ్మర్‌లో విడుదల చేస్తే బాగుంటుందని అనుకున్నాం. తర్వాత జూన్ 27 కరెక్ట్ అనిపించింది. నాగ్, స్వప్న, ప్రియాంక ఫస్ట్ కాపీ చూశారు. విజయంపై ఎలాంటి సందేహం లేదన్నారు. నాగ్ అశ్విన్ ఈ కాన్సెప్ట్ గురించి చెప్పిన రోజు ఓ కొత్త ప్రపంచంలో విహరించబోతున్నామనే అనుభూతి కలిగింది. ప్రతి అంశాన్ని కూలంకషంగా చర్చించి తనదైన సృజనాత్మకతతో స్క్రిప్ట్ సిద్ధం చేశాడు. ఈ సినిమా మొదలుపెట్టే ముందు లెజెండరీ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావుతో మాట్లాడాం. కథ విషయంలో ఆయన మంచి సలహాలు ఇచ్చారు. అవి ఎంతగానో ఉపయోగపడ్డాయి.



> ఈ కథ అనుకున్నప్పుడే రెండో భాగం కూడా తీయాలనే ఆలోచన వచ్చింది. కమల్‌హాసన్‌గారు ఈ ప్రాజెక్ట్‌లోకి ఎంటరైన తర్వాత సెకండ్ పార్ట్ పక్కాగా తీయాలని డిసైడయ్యాం. ప్రతినాయకుడు సుప్రీం యాస్కిన్ పాత్ర కోసం తొలుత కమల్‌హాసన్‌ను అనుకోలేదు. అర్జునుడిగా విజయ్‌దేవరకొండ సహా మిగతా ఆర్టిస్టులందరినీ మొదటినుంచే అనుకున్నాం.

### 600 కోట్లు ఖర్చు పెట్టాం

సినిమా నిర్మాణ సమయంలో రికార్డ్స్ గురించి ఆలోచించలేదు. ఓ అత్యద్భుతమైన చిత్రాన్ని అందించాలనే తపనతో టీమ్ అందరమూ కష్టపడ్డాం. ప్రభాస్, అమితాబ్‌బచ్చన్, కమల్‌హాసన్, నాగ్ అశ్విన్ వెండితెరపై ఓ వండర్ క్రియేట్ చేశారు. వారి ప్రోత్సాహంతోనే సినిమాకు 600కోట్లు ఖర్చు పెట్టే ధైర్యం వచ్చింది. ప్రభాస్ అందించిన కో ఆపరేషన్ గురించి ఎంత చెప్పినా తక్కువే. ఆయన నిజంగా డార్లింగే. ముంబయిలో జరిగిన ప్రచార కార్యక్రమంలో అమితాబ్ గారు నాకు పాదాభివందనం చేసినప్పుడు నా తలకాయ కొట్టేసినంత పనైంది (నవ్వుతూ). మేము కలిసినప్పుడు పరస్పరం నమస్కరించుకుంటాం. అయితే ఆ రోజు స్టేజీ మీద ఆయన అలా చేయడం అస్సలు ఊహించలేదు. అమితాబ్ గారు లెజెండ్. ఆయనకు హ్యాట్సాఫ్.

### తండ్రిగా గర్వపడుతున్నా

ఈ సినిమా సెకండ్‌పార్ట్‌కు సంబంధించిన షూటింగ్ కొంతమేర పూర్తయింది. వీఎఫ్ఎక్స్ వర్క్ ఎక్కువగా ఉంటుంది కాబట్టి పూర్తి చేయడానికి ఏడాదికిపైగా పట్టొచ్చు. రెండో భాగం రిలీజ్ డేట్‌పై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అన్నీ అనుకూలిస్తే వచ్చే ఏడాది ఇదే సమయానికి రావొచ్చు. మా అమ్మాయిలు ప్రపంచస్థాయి సినిమా తీసినందుకు తండ్రిగా గర్వపడుతున్నా. మా సంస్థను వారు గొప్ప శిఖరాలకు తీసుకెళ్తున్నారు. 'కల్కి' సినిమాటిక్ యూనివర్స్ నుంచి ప్రస్తుతం రెండు సినిమాలు మాత్రమే తీసుకురావాలని అనుకున్నాం. తర్వాత స్క్రిప్ట్‌ను బట్టి మిగతా భాగాల గురించి ఆలోచిస్తాం. వైజయంతీ మూవీస్ బ్యానర్ కింద త్వరలో శ్రీకాంత్ తనయుడు రోషన్‌తో 'ఛాంపియన్' సినిమా చేయబోతున్నాం. అలాగే దుల్కర్ సల్మాన్‌తో ఓ సినిమా చేస్తున్నాం.

### నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం

నిర్మాతగా యాభై ఏళ్ల ప్రయాణాన్ని పూర్తి చేసుకోవడం చాలా ఆనందంగా ఉంది. మా వైజయంతీ మూవీస్ సంస్థలో మొదటి చిత్రం 'ఎదురులేని మనిషి' నుంచి 'కల్కి' వరకు పనిచేసిన ఆర్టిస్టులు, టెక్నీషియన్స్ అందరికీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు చెబుతున్నా. నా విజయాల్లో వారందరికీ భాగస్వామ్యం ఉంది. మున్ముందు కూడా అందరూ గర్వించే చిత్రాలతో ప్రేక్షకులు మాపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం.

... సినిమా డెస్క్

# సిస్టమ్‌పై పిస్టల్ సేనాపతి 2.0

**శంకర్ యాక్షన్ అంటే..**
**ప్రేమికుడు 'టేకిటీజీ పాలసీ' అంటాడు.**
**'జెంటిల్ మెన్' హంటర్ మ్యాన్ అవుతాడు.**
**'శివాజీ'.. వాహ్ జీ అనిపిస్తాడు.**
**అదే శంకర్ రీ యాక్షన్ అంటే..**
**ఆయన యాక్షన్‌లోంచి పుట్టిన 'భారతీయుడు' ఊరుకుంటాడా!**
**28 ఏండ్ల కిందట మండువేసవిలో దడపుట్టించిన 75 ఏండ్ల సేనాపతి...**
**103 ఏండ్లప్పుడు పూనకంతో ఊగిపోతున్నాడు. ఇంతకీ ఈ రెండో**
**ఇండియన్ ఏం చేయబోతున్నాడు.. ఫస్ట్ ఇండియన్ ఏం చేశాడు..**

1996 మే 9.. 'భారతీయుడు' రిలీజైంది. అంతకుముందే ఆ సినిమా పాటలు విడుదలయ్యాయి. ఏ నోట విన్నా ఆ పాటలే! ఏ టేప్ రికార్డర్‌లో చూసినా భారతీయుడు క్యాసెట్టే..! ఆ పాటలతో వీనులవిందు చేసుకొని.. థియేటర్‌కు వెళ్లినవాళ్లకు మొదటి ఆట నుంచే కన్నులపండుగ మొదలైంది. సేనాపతి అలియాస్ భారతీయుడుగా కమల్ హాసన్ విశ్వరూపం. చందూగా అల్లరి వేషం. ఏం చేశాడు సేనాపతి. కలుపు తీశాడు. పచ్చని పైరును నాశనం చేసే కలుపును కూకటివేళ్లతో పెకిలించాడు. అవినీతిని అంతం చేయడానికి కన్నకొడుకు అని కూడా చూడకుండా కడతేర్చాడు.

**కొడుకును** తండ్రి చంపడం ఏంటి? సెంటిమెంట్‌గా వర్కవుట్ అయ్యే ఫార్ములా కాదు! ఈ ఎండింగ్ చూసి బయ్యర్లు బిర్రబిగుసుకుపోయారు. కానీ, దర్శకుడు శంకర్ దాన్ని ఒప్పించగలిగాడు. కథ, కథనాలతో ప్రేక్షకులనూ మెప్పించగలిగాడు. క్లాస్ ఏ పీపుల్ నుంచి సీ సెంటర్ సినిమా అభిమానులతోనూ ఆమోదింపజేసుకున్నాడు. పైగా చందు పాత్ర తక్కువదేం కాదు! ఆ పాత్ర లేకుంటే.. సినిమా ఉండేదో లేదో, ఉన్నా ఆడేదో కాదో..! మనీషాతో పాటలు, ఊర్మిళతో ఆటలు.. ఏఆర్ రెహమాన్ సంగీతం... అబ్బో ఈ సినిమాను వండర్‌గా నిలబెట్టడంలో చందూ పాత్ర వేసిన చిందులూ కారణమే! చిన్న ఫ్లాష్‌బ్యాక్.. లంచం ఇవ్వనన్న తండ్రి పంతమే తన చెల్లి చావుకు కారణమని చందూ కోపం. లంచం ఇవ్వలేని తండ్రి.. లంచం పుచ్చుకునే కొడుకు. తన నేరం బయటపడొద్దని తండ్రినే పోలీసులకు పట్టించిన




కొడుకు పాత్రలో కమల్ హాసన్ ఉన్నా... ఆ పాత్రపై ప్రేక్షకులకు చిర్రెత్తేలా చేయడంలో దర్శకుడిదే పైచేయి అయింది. ఎయిర్‌పోర్టు రన్‌వే మీద కనిపెంచిన కొడుకును సేనాపతి నిర్దయగా కత్తి పోట్లు పొడుస్తుంటే సీట్లకు అతుక్కుపోయారు ప్రేక్షకులు. ఆ తర్వాత బ్లాస్టింగ్‌లో సేనాపతి చనిపోయాడు అనుకొని అయ్యో అనుకున్నారు. సింగపూర్‌లో తేలిన ఆ పెద్దాయన.. పోలీసులకు ఫోన్ చేసి అవినీతి పడగ విప్పితే.. దాని అంతానికి మళ్లీ వస్తానని చెప్పినప్పుడు ఈలలు మోగాయి. అప్పుడు అజ్ఞాతంలోకి వెళ్లిపోయిన సేనాపతి 28 ఏండ్లకు మళ్లీ వస్తున్నాడు.

**భారతీయుడు** 2 చాలాకాలం కిందటే సెట్స్‌పైకి వెళ్లింది. ఎన్నోసార్లు షూటింగ్‌కు ముహూర్తాలు ఫిక్సయ్యాయి. మరెన్నోసార్లు వాయిదాలు పడ్డాయి. నిర్మాతలు మారారు. టెక్నీషియన్స్ మారారు. కథానాయికలు కొత్తవాళ్లు. మారనిది ఇద్దరే! ఒకరు దర్శకుడు శంకర్, మరొకరు హీరో కమల్ హాసన్. ఈ కథ నచ్చినా.. చేయొద్దనుకున్నాడట కమల్. ప్రాజెక్టు నుంచి తప్పించుకోవడానికి రెమ్యునరేషన్ అధికంగా అడిగానని ఆయనే ఇటీవల చెప్పుకొచ్చాడు. కానీ, శంకర్ మాత్రం భారతీయుడు అంటే కమల్ హాసన్ ఓన్లీ అని ఫిక్సయ్యాడు. హీరో షరతులకు అంగీకరించాడు. షూటింగ్ మొదలైంది. సెట్‌లో ఏదో ప్రమాదం. షూటింగ్‌కు బ్రేక్! కొన్నాళ్లకు మళ్లీ మొదలైంది. కరోనా వచ్చింది. మళ్లీ గ్యాప్!! ఈ శతాధిక భారతీయ వృద్ధ పాత్ర విన్యాసాలు చూడాలని భారతీయులకు రాసిపెట్టి ఉందేమో..! అన్ని కార్యక్రమాలూ విజయవంతంగా పూర్తి చేసుకొని ఇండియన్-2... జూలై 12న బాక్సాఫీస్ దగ్గర తన మర్మకళ చూపించడానికి సిద్ధంగా ఉన్నాడు.

**మొదటి** సినిమాలో లంచం అంతానికి పాటుపడిన సేనాపతి.. ఇప్పుడు ఎవరి పనిపడతాడు? 'ఇది రెండో స్వతంత్ర పోరాటం.. గాంధీజీ మార్గంలో మీరు.. నేతాజీ మార్గంలో నేను..' ఈ డైలాగ్ సినిమా ఎలా ఉండబోతున్నదో చెప్పకనే చూపింది. 'అందరినీ చీల్చి చెండాడే ఓ హంటింగ్ డాగ్ రావాలి' సిద్ధార్థ్ పాత్ర పలికే డైలాగ్ ఇది. ఆ వేటకుక్క ఎంత డేంజరో పార్ట్ వన్‌లో చూసేశాం. తప్పు చేస్తే దాన్నుంచి తప్పించుకోలేమని భయం పుట్టించడానికి వేటాడబోతున్నాడు. ఎలా అన్నది తెరమీద చూడాల్సిందే!

> **అన్నీ హిట్టే..**
>
> **భారతీయుడు** విజయంలో పాటల పాత్రా ఉంది. అందులోని 'పచ్చని చిలుకలు తోడుంటే..' పాట ఇప్పటికీ పాడే కోయిలలు ఎన్నో. 'టెలిఫోన్ ధ్వనిలా నవ్వేదానా..', 'మాయామశ్చీంద్ర మచ్చని చూడగ వచ్చావా..', 'అదిరేటి డ్రస్సు మేమేస్తే..', 'తెప్పలెల్లిపోయాక ముప్పు తొలిగిపోయిందే..' ఐదు పాటలూ అదిరిపోయాయి. రెహ్మాన్ మ్యూజిక్ ఆల్బమ్ ఎవర్‌గ్రీన్ హిట్ జాబితాలో చోటు దక్కించుకుంది. అనిరుధ్ సంగీతం అందించిన 'భారతీయుడు 2' పాటలు ఇప్పుడిప్పుడే వైరల్ అవుతున్నాయి. సినిమా విడుదల వేళకు ఎంత మేరకు పుంజుకుంటాయో చూడాలి!

**సిద్ధార్థ్** పాత్ర సేనాపతి మనవడిది అని ఊహించొచ్చు. ఎందుకంటే... భారతీయుడులో మనీషా పాత్ర గర్భంతో ఉన్నట్టుగా చూపించాడు దర్శకుడు శంకర్. ఆమె కడుపులో ఎదిగిన చందూ ప్రతిరూపం సిద్ధార్థ్ పాత్ర. తండ్రిని చంపిన తాతపై అతనికి ఎలాంటి ఫీలింగ్స్ ఉన్నాయన్నది ఇప్పటికైతే సస్పెన్స్. ట్రైలర్‌లో అయితే.. తాతకు తగ్గ మనవడిలాగే కనిపించాడు. 'భారతీయుడు'లో చందూ కూడా తండ్రికి తగ్గ తనయుడిగానే అనిపిస్తాడు. శంకర్ మార్కు ట్విస్టులు సినిమాను ఏ క్షణంలో అయినా విలక్షణంగా మార్చేయొచ్చు. చూడబోతూ వివరాలు ఎందుకు. ఇంకో పన్నెండు రోజుల్లో 'భారతీయుడు-2' బాక్సాఫీస్ దండయాత్ర మొదలుకానుంది. మర్మకళతో మెస్మరైజ్ చేస్తాడో, మెరుపు స్టంట్లతో మాయ చేస్తాడో చూద్దాం. 103 ఏండ్ల మనిషి స్టంట్లు చేయడమేంటని కొందరి పెదవి విరుపు. మార్షల్ ఆర్ట్స్‌లో సుశిక్షితులై, గుండె బలం కలిగిన యోధులకు వయసు అడ్డంకి కాదని శంకర్ మాట. నిజ జీవితంలోనూ ఇలాంటి యోధులు ఉన్నారని చెప్పుకొచ్చాడు. చివరిగా సేనాపతి మాటల్లో చెప్పాలంటే.. 'టామ్ అండ్ జెర్రీ ఆట ఆరంభమైంది. సో పారిపోనూ లేరు. దాక్కోనూ లేరు'. వెల్‌కమ్ టు సేనాపతి 2.0. ఈయన అవినీతిలో కూరుకుపోయిన సిస్టమ్‌పై ఎక్కుపెట్టిన పిస్టల్!



## ఓటీటీ హిట్

## థ్రిల్లింగ్.. విన్నింగ్..

### లూ (Lou)

**ఓటీటీ:** నెట్‌ఫ్లిక్స్
**నటీనటులు:** అలిసన్ జానీ, జర్నీ స్మోలెట్, రిడ్లే ఆషా, లోగన్ మార్షల్
**డైరెక్టర్:** అన్నా ఫోరెస్టర్

ఆసక్తికర మలుపులు, ఆశ్చర్యం కలిగించే ట్విస్ట్‌లతో రూపొందే థ్రిల్లర్ సినిమాలంటే సినీ ప్రేక్షకులు ఎక్కువగా ఇష్టపడతారు. నెట్‌ఫ్లిక్స్‌లో ట్రెండింగ్‌లో ఉన్న లూ అలాంటి చిత్రమే. లూ అనే వృద్ధురాలు ఇంట్లో ఒంటరిగా నివసిస్తుంది. ఓ రోజు బ్యాంక్‌లోంచి పెద్ద మొత్తంలో డబ్బు విత్ డ్రా చేసుకుని ఇంటికి వస్తుంది. తనకు సంబంధించిన కొన్ని ఫొటోలను, పేపర్లను మంటల్లో తగలబెట్టి కుర్చీలో కూలబడుతుంది. పెద్ద తుపాకీ అందుకుని చనిపోవడానికి సిద్ధమవుతుంది. అదే సమయంలో హన్నా అనే మహిళ తన ఇంట్లోకి పరుగున వస్తుంది. తన కూతురు వీ తప్పిపోయిందని చెప్తుంది. ఆ చిన్నారిని క్షేమంగా తీసుకొస్తానని మాటిచ్చిన లూ ఆత్మహత్య ఆలోచన విరమించుకుంటుంది. మరి లూ మాట మీద నిలబడిందా? చిన్నారిని కిడ్నాప్ చేసిందెవరు? ఆమెను వృద్ధనారి కాపాడిందా? లేదా? అసలు ఆమె ప్రాణాలు తీసుకోవడానికి ఎందుకు సిద్ధపడింది? అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే!



లూ విచిత్రంగా ప్రవర్తించినప్పుడే తన వెనుక ఏదో ఫ్లాష్‌బ్యాక్ ఉందని అర్థమైపోతుంది. పొరుగింట్లో ఉండే చిన్నారి వీని కనీసం ఒక్కసారైనా పలకరించని లూ.. ఆమె కోసం ప్రాణాలకు తెగించి పోరాడటం, ప్రయత్నించడం ఆశ్చర్యం కలిగిస్తుంది. లూగా అలిసన్ జానీ నటన అద్భుతంగా ఉంది. హన్నాగా జర్నీ స్మోలెట్, వీగా రిడ్లే ఆషా నటన ఆకట్టుకుంటుంది. ప్రీ క్లైమాక్స్, కథను మలుపు తిప్పే ట్విస్టు బాగుంటుంది. మీరూ థ్రిల్లర్ మూవీస్‌ని ఇష్టపడేవాళ్లయితే నెట్‌ఫ్లిక్స్‌లో తెలుగులో అందుబాటులో ఉన్న 'లూ' చూసేయండి!